ప్రజాశక్తి
శనివారం 29 జులై 2023
5
అల్లూరి సీతారామరాజు

రచ్చబండ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని హుకుంపేట పంచాయతీ దిగుడుపుట్టులో రచ్చబండ నిర్మాణంకు ఎంపీపీ కూడా రాజుబాబు, జడ్పీటీసీ రేగం మత్స్యలింగంలు శుక్రవారం శంకుస్థాపన చేపట్టారు. అనంతరం జడ్పీటీసీ రేగం మత్స్యలింగం మాట్లాడుతూ, పంచాయతీ పలు సమస్యలను చర్చించేందుకు రచ్చబండ ఎంతో అవసరం అని అన్నారు. అనంతరం స్థానిక ఎలిమెంటరీ పాఠశాలలో మధ్యాహ్న బోజక పథకం, తదితర అంశాలపై విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యులు ముత్యాంగి విశ్వేశ్వరరావు, వైస్సార్సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, సర్పంచ్ సమిడ వెంకటాపూర్ణిమ, నాయకులు పాంగి అనిల్, సూరిబాబు, అప్పన్న పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న నేతలు

వరద జోరు తగ్గని గోదావరి

- ★ పునరావాస కేంద్రాలకు ప్రజల తరలింపు
- ★ ప్రమాద స్థాయిలో వాగులు వంకలు
- ★ మండల కేంద్రాలతో పలు గ్రామాలకు తెగిన సంబంధాలు

ఎత్తైన ప్రాంతంలో రోడ్డుపై గుడారాలు వేసుకుంటున్న బాధితులు

ప్రజాశక్తి- చింతూరు, ఎటపాక

గోదావరి వరద తగ్గినట్టే తగ్గి పెరుగుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తుంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రానికి 48.40 అడుగులు ఉండగా, శుక్రవారం ఉదయానికి 46 అడుగులకు తగ్గింది. మళ్లీ శుక్రవారం సాయంత్రానికి 51.8 అడుగులకు చేరింది. 13,37,253 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతుంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరిపై ఉన్న భారీ ప్రాజెక్టుల్లోకి చేరిన నీరు కిందకు విడుదల చేయడంతో భద్రాచలం వద్ద నీటిమట్టం పెరిగేందుకు ప్రధాన కారణంగా ఉంది. గోదావరి ఎగపోటుతో చింతూరు మండలంలోని సీలేరు, శబరి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

భారీ వర్షాలు, గోదావరి వరద కారణంగా చింతూరు ఏజెన్సీలో వాగులు, వంకలు పొంగి ప్రమాద స్థాయిలో ప్రవహిస్తున్నాయి. దీంతో నాలుగు మండల కేంద్రాలకు వివిధ గ్రామాలతో సంబంధాలు తెగిపోయాయి. చింతూరు మండల కేంద్రానికి సుమారు 100 గ్రామాలతో సంబంధాలు లేకుండా పోయాయి. సోకిలేరు, చంద్రవంక, చీకటి వాగులు రహదారుల పైనుండి పొంగి ప్రవహిస్తుండడంతో గత నాలుగు రోజులుగా రహదారులు మూసుకుపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఎటపాక మండలంలోనూ పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద ముంపుకు గురయ్యే గ్రామాల ప్రజలకు ఎర్రగట్టు, చలంపాలెం, సీతాపురం, గన్నవరం గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. 102 కుటుంబాలకు చెందిన 337 మందిని పునరావాస కేంద్రాలకు తరలించినట్టు అధికారులు తెలిపారు. వరద ఉధృతి పెరగడంతో శుక్రవారం సాయంత్రానికి కన్నయిగూడెం, రాయనపేట, నెల్లిపాక, వీరయిగూడెం, నందిగామ, మురుమూరుల వద్ద రహదారులపై వరద నీరు ప్రవహిస్తుంది. ఈ ప్రాంతాల్లో ప్రజలు నీళ్లలోకి వెళ్లకుండా ఎటపాక పోలీసులు కాపలా కాస్తున్నారు.

వరద ప్రవాహంలో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

పునరావాస కేంద్రాలకు తరలింపు

విఆర్.పురం : గోదావరి నీటి మట్టం పెరుగుదలతో మండలంలోని రామవరం, గుర్రంపేట, నూతిగూడెం, కన్నాయిగూడెం కాలనీ, వడ్డిగూడెం, ధర్మతాల గూడెం, వడ్డిగూడెం కాలనీ గ్రామాల ప్రజలు ఎత్తైన ప్రాంతాలకు సామాన్లుతో తరలివెళ్లారు. ప్రజలను పోలీస్ యంత్రాంగం అప్రమత్తం చేస్తోంది. రెవెన్యూ అధికారులు లోతట్టు గ్రామాలకు నిత్యవసర సరుకులు పంపించారు. శుక్రవారం రాత్రికి గోదావరి నీటి మట్టం 60 అడుగులు వస్తుందని అంచనాతో అధికారులు లోతట్టు ప్రాంత ప్రజలను పునరవాస కేంద్రాలకు తరలిస్తున్నారు. రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, పంచాయతీ కార్యదర్శులు స్వరూప రెడ్డి,శ్రీనివాసరావు, వెంకట్ శివ ప్రసాద్ దగ్గరుండి పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు.

రాయనపేట వద్ద జాతీయ రహదారిపై వరద నీటిలో ప్రయాణిస్తున్న లారీ

సురక్షిత ప్రాంతాల్లో గుడారాలు ఏర్పాటు

కూనవరం : గోదావరి ముంపు ఈ ప్రాంతాల ప్రజలకు కంటిమీద నిద్ర లేకుండా చేస్తుంది. ఇప్పటికే మండల కేంద్రం కూనవరం, టేకుల బోరు ఖాళీ అవగా, మిగతా ముంపు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని అధికారులు సూచించారు. ముల్లూరు గ్రామాన్ని వరద ముంచెత్తడంతో సురక్షిత ప్రాంతాలకు తరలివెల్లాలని సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, సచివాలయ సిబ్బంది కోరారు. ఇప్పటికే ఎత్తైన ప్రాంతాలలో తాత్కాలిక గుడారాలు వేసుకోవడంలో ముంపు ప్రజలు నిమగ్నమయ్యారు. కోతుల గుట్ట పునరావాస కేంద్రంలో ఉల్లి పాయలు, బంగాళా దుంపలు బాధితులకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ అనసూయ, ఎంపీడీఓ ప్రేమ్ సాగర్, జెడ్పీటీసీ గుజ్జా విజయ, సర్పంచ్ హేమంత్ పాల్గొన్నారు.

వరద బాధితులకు కూరగాయలు అందజేస్తున్న విఆర్.పురం ఎంపిపి లక్ష్మి

41.15 కాంటూరులో చేర్చాలని జలదీక్ష

చింతూరు : పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురవుతున్న కొమ్మూరు గ్రామ ప్రజలు శుక్రవారం వరద నీటిలోకి దిగి జల దీక్ష చేపట్టారు. తమ గ్రామాన్ని 41.15 కాంటూరులో చేర్చాలని, వరద ముంపునకు గురైన ప్రతి కుటుంబానికీ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వరదల వల్ల గుట్టలపై గుడారాలు వేసుకున్న నిర్వాసితులందరికీ ప్లాస్టిక్ బరకాలు, నిత్యాసర వస్తువులు అందివ్వాలని, వైద్య శిబిరం నిర్వహించాలని, కుమ్మురు నుండి చింతూరు మండల కేంద్రానికి మర బోటు ఏర్పాటు చేయాలని కోరారు.

వరద నీటిలో జలదీక్ష చేస్తున్న కొమ్మూరు నిర్వాసితులు

ప్రజాశక్తి కథనాలతో నిత్యావసరాల పంపిణీ

విఆర్.పురం : నిత్యావసరాలు అందించడం లేదని ప్రజాశక్తిలో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించి రామవరం, కోపల్లి గ్రామాలకు కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, క్యాబేజీ వంటి సరుకులు అందించారు. విఆర్.పురం, వడ్డిగూడెం, ధర్మతలగూడెం, వడ్డుగూడెం కాలనీ గ్రామాల బాధితులకు కందిపప్పు ఇచ్చారు. రేఖపల్లి పునరవాస కేంద్రాల్లో హెల్త్ సెంటర్ ఏర్పాటు చేసి నిర్వాసితులను సీజన్లో వచ్చే వ్యాధులను పట్ల శ్రద్ధ చూపిస్తున్నారు.

ఇంకా ఎన్నాళ్లీ బాధలు

పోయిన ఏడాది గోదావరి వరదలకు సర్వం కోల్పోయి ఇప్పటికీ ఆర్థికంగా కుదుటపడలేదు. ఇపుడు మళ్ళీ వస్తున్న గోదావరి వరదలతో కొండల్లో, రోడ్ల పక్కన తల దాచికోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియక బయపడుతున్నాం. ఇంకా ఎన్నాళ్ళ ఇలా బాధలు పడాలో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్యాకేజీ ఇచ్చి తరలిస్తే మంచిది.

- పైదా భద్రయ్య, మూల్లూరు గ్రామం, కూనవరం మండలం

ఎటువంటి సహాయమూ అందలేదు

మళ్ళీ గోదావరి వచ్చి మా జీవితాలను అతలాకుతలం చేస్తుంది. ఇప్పటికీ ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం అందలేదు. ముందస్తు సహాయక చర్యలు చేపట్టలేదు. బరకాలు, కొవ్వొత్తులు ఇవ్వాలని కోరుతున్నాం. సోలార్ లైట్లు కూడా ఏర్పాటు చేస్తే మంచిది.

- బొడ్డు కాంతమ్మ, ముల్లూరు గ్రామం, కూనవరం మండలం

రెండు రోజులుగా ఏ అధికారీ రాలేదు

గత రెండు రోజులుగా వరద చుట్టుముట్టి మా గ్రామానికి రహదారులు మూసుకుపోయాయి. మాకు పడవ ప్రయాణమే దిక్కయింది. మాకు నిత్యావసరాలు అందించడం లేదు. మా గ్రామానికి కేటాయించిన అధికారి రెండు రోజులుగా గ్రామానికి రాలేదు. మా బాధలు, గాథలు పైఅధికారులకు ఎవరు తెలియపరుస్తారో అర్థం కావడం లేదు. వరదల సమయంలో విధుల్లో అలసత్వం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి.

- కాకా అర్జున్, మురుమూరు, ఎటపాక మండలం

ముంపు గ్రామాల ప్రజలను కలిసిన సిపిఎం నాయకులు, కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న నెల్లిపాక సర్పంచ్

ముంపు గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటన

అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి సమస్యలను తెలియజేసిన నాయకులు

ప్రజాశక్తి - ఎటపాక

వరద ముంపునకు గురైన మండలంలోని కుసుమనపల్లి, రాఘవపురం, గుమ్మకోయగూడెం, వీరాయిగూడెం, నెల్లిపాక, తోటపల్లి, నల్లకుంట, గన్నవరం తదితర గ్రామాల్లో సిపిఎం బృందం శుక్రవారం పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంది. తమకు ఇంత వరకు నిత్యవసర వస్తువులు ఏమి ఇవ్వలేదని ముంపు బాధిత ప్రజలు సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయా గ్రామాల్లో సమస్యలపై సిపిఎం నాయకులు అక్కడి నుండే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించి పరిష్కరించాలని కోరారు. నెల్లిపాక సర్పంచ్ కొర్స భద్రమ్మ కలెక్టర్‌కు కాల్ చేసి వీరాయిగూడెం గ్రామం పది రోజులుగా జల దిగ్బంధంలో చిక్కుకుందని, కానీ తమకు ఇంత వరకు నిత్యావసరాలు ఇవ్వలేదని, వాటిని తెచ్చుకోడానికి పడవను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ ముంపు గ్రామాల ప్రజలకు తక్షణమే నిత్యావసర సరుకులు అందించాలని, ప్రజలను తరలించేందుకు బోట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఐవి, ఆకిశెట్టి రాము, ఇరపా అజయ్, బుద్దుల భద్రయ్య, జి.హుస్సేన్, ఇరపా సత్యం, జి.హరి, తోట శ్రీను, నూతలపాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతి

కూనవరం : గోదావరి ముంపు గ్రామాల ప్రజల సమస్యలపై సీపీఎం నాయకులు శుక్రవారం తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సిపిఎం నాయకులు మేకల నాగేశ్వరరావు, పాయం సీత రామయ్య, ఎంపీటీసీలు నాగమణి, జయసుధ, తలగాని నాగరాజు, శ్యామల కృష్ణ, బాబు బొర్రయ్య, బాబురావు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలు పరిశీలన

చింతూరు : పునరావాస కేంద్రాల్లో ఉంటున్న వరద బాధితులకు వెంటనే నిత్యవసర సరుకులు ఇవ్వాలని సిపిఎం నాయకులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. శుక్రవారం కుమ్మూరు, బోర్రాయి గూడెం పునరావాస కేంద్రాలను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. తమకు నిత్యావసరాలు ఇవ్వలేదని, తాము కొనుక్కుందామన్నా బోటు సౌకర్యం ఏర్పాటు చేయలేదని బాధితులు తెలిపారు.

గుడారాల్లో బాధితులను పరామర్శిస్తున్న జెడ్పిటిసి

గుడారాలను సందర్శించిన టిడిపి, సిపిఎం, జనసేన నేతలు

విఆర్.పురం : మండలంలోని సుద్ద గూడెం గ్రామం వచ్చి రేఖపల్లిలో గుడారాలు ఏర్పాటు చేసుకొని ఉంటున్న వారిని జెడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, టిడిపి, సిపిఎం నాయకులు శుక్రవారం సందర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం అందలేదని బాధితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి, సిపిఎం నాయకులు ఆచంట శ్రీనివాస్, ముత్యాల రామారావు, బురక కన్నారావు, ఎండి రహీం, మల్లికార్జున రావు, పూనెం సత్యనారాయణ, పాల్గొన్నారు. జనసేన నాయకులు ములకాల సాయికృష్ణ, బాగుల అంజనరావు, శ్రీనివాస్ రెడ్డి, కళ్యాణ్, నాగేంద్ర, పవన్ తదితరులు గుడారాలాను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు.

కూనవరం తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ఎంపి విజయసాయిరెడ్డిపై ఆదివాసీల ఆగ్రహం

-బోయ/వాల్మీకులపై పార్లమెంట్‌లో ప్రస్తావనపై నిరసనలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: బోయ/వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో ఆమోదించిన తీర్మానాన్ని అమలు చేయాలని రాజ్యసభలో విజయసాయిరెడ్డి ప్రస్తావించడంపై శుక్రవారం ఎపి ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయం నుండి తహసిల్దార్ కార్యాలయం జంక్షన్ వరకు సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. విజయసాయిరెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసి గిరిజనులకు వైసీపీ ప్రభుత్వం ద్రోహం చేస్తుందన్నారు. జీవన విధానంలో భిన్నంగా ఉన్న బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రస్తావన చేయడం దుర్మార్గమన్నారు. వీరిని ఎస్టీ జాబితాలో చేర్చితే ఆదివాసిల మనుగడకు ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. ఆదివాసుల హక్కులు, చట్టాలు కాలరాస్తూ అనర్హులైన బోయా/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, బోయా/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రయత్నాలు మానుకోవాలని, లేని పక్షంలో నిరసనలు, రాస్తారోకోలు, ముట్టడులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు గాసిరాం దొర, నర్సింగ్ పడాల్, రామదాసు, బలరాం, సిపిఎం మండల కార్యదర్శి భీమరాజు పాల్గొన్నారు.

ముంచంగిపట్టులో విజయసాయిరెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ఎస్టి జాబితాలో చేర్చిస్తే సహించం

డుంబ్రిగుడ: బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ పార్లమెంటులో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రస్తావించడాన్ని నిరసిస్తూ స్థానిక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని అరకు సంత బయలు వద్ద గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.చిన్నస్వామి మాట్లాడుతూ, ఆర్థికంతో పాటు అన్ని రకాలుగా అభివృద్ధి చెందిన బోయ/వాల్మీకులను ఎస్టి జాబిలో చేర్పిస్తే గిరిజనులు తీవ్రంగా నష్టపోతారన్నారు. దీనిపై గిరిజన ఎమ్మెల్యేలు పాల్గుణ, భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రవిబాబు, ఎంపీ మాధవి తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన జాతికి ద్రోహం చేస్తున్నప్పటికీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు కనీసం నోరు మెదపకపోవడం సరికాదన్నారు. తక్షణమే తమ పదవులకు రాజీనామాలు చేసి గిరిజనులతో కలిసి పోరాటం సాగించాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు డి.మోహన్ రావు, ఉపాధ్యక్షుడు పి.గంగాధర్, సీనియర్ నాయకులు పి వెంకటబాబు కొండప్ప, స్వాభి, గేన్ను పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో కాంగ్రెస్ నేతల ర్యాలీ

వరదల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

ప్రజాశక్తి-పాడేరు: చింతూరు డివిజన్‌లో ప్రస్తుత వరద పరిస్థితి కారణంగా సహాయ కార్యక్రమాలపై పర్యవేక్షణకు ఇద్దరు ప్రత్యేక ఉప కలెక్టర్లను మండల ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసారు. కూనవరం ప్రత్యేక ఉప కలెక్టర్ వి. వెంకట రమణను, కూనవరం ప్రత్యేక అధికారిగాను, వి.ఆర్ పురం ప్రత్యేక ఉప కలెక్టర్ జి.లక్ష్మీపతిని వి.ఆర్.పురం ప్రత్యేకాదికాగాను నియమించారు. ఈ ఇద్దరు ప్రత్యేక అధికారులు సంబంధిత మండలాల్లోని మండల ప్రధాన కేంద్రంలో ఉండి,తహశీల్దార్‌లతో సమన్వయం చేసుకుని నిత్యావసర సరుకుల పంపిణీ పర్యవేక్షించాలని సూచించారు.వరద సహాయక చర్యలు సజావుగా సాగేందుకు ప్రత్యేక అధికారులతో సమన్వయం చేసుకోవాలని కూనవరం, వీఆర్ పురం తహశీల్దార్లు, అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

In The Court Of The Hon'ble IVth Additional Junior Civil Judge :: Kakinada
I.A.No. 140/2021 in O.S.No. 347/2021

Between:
Korumilli Bala Prasad
...Petitioner /Plaintiff
AND
Kunjam Anantha Laxmi
...Respondent /Defendant

TO: Kunjam Anantha Lakxmi, W/o. Dattem Venkata Ramana, aged about 45 yrs, C/o. Hindu, Working as Secondary Grade Teacher, R/o. D.No.2-8, Ramalayam Street, I.Polavaram (V), Rampachodavaram (M), E.G.Dits.

పై నెంబరు పిటీషనులో రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయు చున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 11-08-2023వ తేదీకి వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం గం|| 10:30 ని||లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల పై పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎం.జవహర్ ఆలీ
అడ్వకేట్, డో.నెం.25-6-11,
గంజాం వారి వీధి, కాకినాడ.
సెల్: 98483 07906

In The Court Of The Hon'ble IVth Additional Junior Civil Judge :: Kakinada
O.S.No. 347/2021

Between:
Korumilli Bala Prasad
...Plaintiff
AND
Kunjam Anantha Laxmi
...Defendant

TO: Kunjam Anantha Lakxmi, W/o. Dattem Venkata Ramana, aged about 45 yrs, C/o. Hindu, Working as Secondary Grade Teacher, R/o. D.No.2-8, Ramalayam Street, I.Polavaram (V), Rampachodavaram (M), E.G.Dits.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయు చున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.11-08-2023వ తేదీకి వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం గం|| 10:30 ని||లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎం.జవహర్ ఆలీ
అడ్వకేట్, డో.నెం.25-6-11,
గంజాం వారి వీధి, కాకినాడ.
సెల్: 98483 07906

పలు చోట్ల గంజాయి స్వాధీనం

పట్టుబడిన వాహనాలు స్టేషన్‌కు తరలింపు

ప్రజాశక్తి-పెదబయలు:

మండలంలో వేరు వేరు ప్రాంతాల్లో స్థానిక పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా వేరు వేరు ప్రాంతాల్లో గంజాయితో పాటు నిందితులు పట్టుబడ్డారని శుక్రవారం స్థానిక ఎస్ఐ పులి మనోజ్ కుమార్ విలేఖరులకు తెలిపారు. అడుగుల పుట్టు పంచాయతీ కొత్తప్యూట్టు జంక్షన్ వద్ద నుండి ఒడిస్సాకు తరలిస్తున్న పల్సర్ బైక్ పైలెట్‌గా ముందుకు వెళుతూ వెనక జీపులో గంజాయి తరలిస్తుండగా కొత్తప్యూట్టు జంక్షన్ వద్ద తనిఖీ చేయగా పోలీసులను చూసి నలుగురు పరరయ్యారని, ఇద్దరు పట్టుబడ్డారని తెలిపారు. నాలుగు బస్తాల గంజాయిని పోలీసుస్టేషన్ కు తరలించామని చెప్పారు. అదేవిదంగా సీతగుంట పంచాయతీ కేంద్రం సీతగుంట జంక్షన్ వద్ద మరో మహేంద్ర జీపు పల్సర్ బైక్ గంజాయితో పట్టుబడ్డాయని ఎస్ఐ తెలిపారు. జామిగూడ నుండి మహేంద్ర వాహనంలో ముగ్గురు వ్యక్తులు 15 బస్తాలతో గంజాయిని తరలిస్తుండగా పట్టుబడ్డారని 450 కేజీల వరకు గంజాయి ఉంటుందని తెలిపారు. పట్టుబడిన వాహనాలను, నిందితులను పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు. పరారిలో ఉన్న వారిని త్వరలో పట్టుకుంటామన్నారు. గంజాయి సాగు చేయడం, అక్రమ రవాణా నేరమని తెలిపారు. గంజాయి సాగును విడనాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనకు పలు సమస్యలు

వినతులు స్వీకరరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పాడేరు: స్థానిక సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన స్పందనకు 76 అర్జీలు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, ఐటిడిఏ పిఒ వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ సంయుక్తంగా జిల్లా వ్యాప్తంగా వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. రహదారుల నిర్మాణాలు, అంగన్వాడీ కేంద్రాలు మంజూరు, సిసి రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు, భూ సమస్యలపై అత్యధికంగా వినతి పత్రాలు అందాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి స్పందనలో అధికారులు స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు ఇవి. 2018 నుండి 2020 వరకు నిర్మించిన ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలని ముంచంగిపుట్టు మండలం జర్జుల గ్రామ పంచాయతీ సర్పంచ్ డి.పార్తిమ వినతి పత్రం సమర్పించారు. బుర్జగుంట, కులబీరు, సిరగంపుట్టు, పెద తమ్మంగుల గ్రామాలకు సిసి రోడ్లు మంజూరు చేయాలని కోరారు. పాడేరు మండలం వర్తనాపల్లి కాలనీకి తాగునీటి సదుపాయం కల్పించాలని వినతి పత్రం అందజేసారు. డుంబ్రిగుడ మండలం గుంటసీమ పంచాయతీ తడ్డ గ్రామస్తులు తడ్డ గ్రామం నుండి తూటంగికి తూటంగి గ్రామం నుండి నేరేడు వలస గ్రామాలకు రోడ్లు నిర్మించాలని కోరారు. అరకు వ్యాలీ మండలం బొండాం పంచాయతీ పరిధిలోని నిన్నిమామిడి, రంగిని వలస గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవన నిర్మాణాలు పూర్తి చేయాలని సర్పంచ్ దురియా భాస్కరరావు వినతి పత్రం సమర్పించారు.డుంబ్రిగుడ మండలం తూటంగి పంచాయతీ బొడ్డపుట్టు గ్రామానికి సిసి రోడ్డు, డ్రైనేజీ మంజూరు చేయాలని సర్పంచ్ జి.కమల దరఖాస్తును అందజేసారు.వై.రామవరం మండల కేంద్రానికి చెందిన పల్లాల రవి కుమారి, తన కుమారుడు శశి కిరణ్ పేరును రేషన్ కార్డులో నమోదు చేయాలని దరఖాస్తును సమర్పించారు. కొయ్యూరు మండలం చిట్టెంపాడు హైస్కూలు వెళ్లే మార్గంలో సిసి రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తుడు టి.రమణబాబు కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, జిల్లా వ్యవసాయా ధికారి ఎస్.బి.ఎస్.నంద్, గిరిజన సంక్షేమ శాఖ ఇఇలు డి.వి.ఆర్. ఎం.రాజు, కె.వేణు గోపాల్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇఇ లీలా క్రిష్ణ, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్‌రావు, కాఫీ ఎడి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

10న రేషన్ బియ్యం వేలం

ప్రజాశక్తి-పాడేరు: ప్రజా పంపిణీ వ్యవస్థ కు చెందిన అక్రమంగా రవాణా చేసిన వారి నుండి బియ్యం నిల్వలు సీజ్ చేశామని, నిందితులపై కేసులు నమోదు చేయడం జరిగిందని సంయుక్త కలెక్టర్ జే. శివ శ్రీనివాసు ఒక ప్రకటనలో తెలిపారు. సీజ్ చేసిన సరకు పాడేరు, జి.మాడుగుల, కొయ్యూరు, పెదబయలు, చింతూరు, రంపచోడవరం, రాజవొమ్మంగి, అడ్డతీగల మండలాల గోదాములలో భద్ర పరిచామని తెలిపారు. ఆయా గోదాముల్లో భద్రపరిచిన బియ్యంను వచ్చేనెల 10న మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ వేలం వేస్తామని జే.సి తెలిపారు.వేలంలో పాల్గొనే వారు డిడి తీయాలని సూచించారు. వ్యాపారి, రైస్ మిల్లర్ కు తప్పనిసరిగా జిఎస్‌టి ఉండాలన్నారు. పూర్తి వివరములకు పాడేరు కలెక్టరేట్ ప్రాంగణములో జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో సంప్రదిం చాలన్నారు.

హెచ్ఐవి, ఎయిడ్స్ పరీక్షలపై సమీక్ష

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో ఐసిటీసీ సెంటర్లలో హెచ్ఐవి, ఎయిడ్స్ టెస్టులపై శుక్రవారం జిల్లా కేంద్రంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ విశ్వేశ్వరరావు నాయుడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వైద్యులు కామేశ్వర ప్రసాద్, రాజేంద్రప్రసాద్, కోఆర్డినేటర్లు సుకుమార్, శైలజ, ఐసిటిసి, ల్యాబ్ టెక్నీషియన్, కౌన్సిలర్స్ పాల్గొన్నారు.

పొగరాని పొయ్యిలకు డబ్బులు వసూలు

ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్

మాట్లాడుతున్న పి బాలదేవ్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: పాడేరు ఐటిడిఏ పరిధిలో ఉచితంగా పంపిణీ చేయాల్సిన పొగరాని పొయ్యిలకు ఆదివాసి లబ్ధిదారుల నుండి డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకొని తిరిగి డబ్బులు లబ్ధిదారులకు తిరిగి చెల్లించాలని ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయంలో స్థానిక స్థానిక విలేకరులతో బాలదేవ్ మాట్లాడారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో అనంతగిరి, అరకువేలి, డుంబ్రిగూడ, హుకుంపేట, పెదబయలు, ముంచింగిపుట్టు, పాడేరు, జి మాడుగుల మండలాల్లో లండల్ ట్రమోంటనా కంపెనీ సహకారంతో సుమారు మూడు వేలు ఖరీదైన పొగరాని పొయ్యిలను ఆదివాసులకు ఉచితంగా పంపిణీ చేయాలని క్రాప్ జోన్ ఆగ్రో ఫారెస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సంస్థ ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఎనిమిది మండలాల పరిధిలో 40 వేల మంది లబ్ధిదారులకు ఒక్కొక్క లబ్ధిదారుల నుండి 250 రూపాయలు చొప్పున క్రాప్ జోన్ అగ్రో ఫారెస్ట్రీ సంస్థ ప్రతినిధులు రవాణా చార్జీలు పేరుతో సుమారు కోటి రూపాయలు వసూలు చేశారని అన్నారు. దీనిపై అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని బాధ్యులపై చర్యలు తీసుకొని లబ్ధిదారులకు వసూలు చేసిన డబ్బులు తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు. లండల్ ట్రమోంటనా కంపెనీ వారు ఉచితంగా పంపిణీ చేయాలని క్రాప్ జోన్ అగ్రో పారెస్ట్రీ ప్రైవేటు సంస్థలు ప్రతినిదులు అక్రమాలకు పాల్పడ్డటం సరికాదన్నారు. తక్షణమే వసూలు చేసిన డబ్బులు తిరిగి చెల్లించాలని లేనిపక్షంలో లబ్ధిదారులతో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు జి చిన్నబాబు, మండల కార్యదర్శి పి.రామన్న, నాయకులు నాని బాబు, లబ్ధిదారులు అర్జున్, రామన్న, విజయ్, చిన్నంరాజు, సన్యాసిరావు, పాల్గొన్నారు.

ఆహార వ్యర్థాలతో వర్మీ కంపోస్ట్ తయారీ

ఉత్తరాంధ్ర రైతులకు గీతంలో శిక్షణ

కంపోస్ట్ తయారీపై అవగాహన కల్పిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : ఇళ్లు, హోటళ్లు, విందు కార్యక్రమాలలో మిగిలిపోయి వృథాగా పారబోసే ఆహార వ్యర్థాలతో వ్యవసాయానికి ఉపయుక్తమైన ఎరువు తయారుచేసి, పంట దిగుబడులను పెంచే గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పర్యావరణ శాస్త్ర విభాగం చేపట్టిన ప్రాజెక్టు సత్ఫలితాలను ఇస్తోందని ప్రాజెక్టు ప్రధాన నిర్వహణాధికారి డాక్టర్ ఎన్.శ్రీనివాస్ వెల్లడించారు. భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) మంజూరు చేసిన సైన్స్ ఫర్ ఈక్విటీ ఎంపవర్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్ (సీడ్) ప్రాజెక్టులో భాగంగా శుక్రవారం ఉత్తరాంధ్ర జిల్లాలలోని రైతులకు దీనిపై అవగాహన, శిక్షణనిచ్చారు. వ్యర్థ ఆహార పదారాల్లోని పోషకవిలువల ఆధారంగా వాటిని చిన్నగుళికలుగా చేసి పైర్లలో వాడడం వల్ల మంచి పంట దిగుబడులు వచ్చినట్లు తమ పరిశీలనలో వెల్లడైందన్నారు. దీనికోసం గీతం ప్రాంగణంలో ప్రత్యేకంగా కంపోస్ట్ తయారీకేంద్రం నెలకొల్పామని, ప్రయోగాత్మకంగా 250 మంది రైతులకు అందించామన్నారు.

కంపోస్ట్ తయారీపై 100 మంది రైతులకు దశలవారీగా శిక్షణ ఇచ్చామన్నారు. నేలలోని సారాన్ని దెబ్బతీసే సింథటిక్ ఎరువల కంటే, వ్యర్థ ఆహారపదార్థాల కంపోస్ట్‌తో మంచి ప్రయోజనం పొందవచ్చన్నారు. ప్రాజెక్టు కోఇన్వెస్టిగేటర్, గీతం పర్యావరణశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సురేష్ కుమార్ మాట్లాడుతూ దేశంలో ఏటా వృథా అవుతోన్న 67 మిలియన్ టన్నుల ఆహారవ్యర్థాలతో పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని కంపోస్ట్‌గా మార్చడం ఉభయ తారకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ ఐ.బంగారు రాజు, వివిధ ప్రాంతాల రైతులు, స్కాలర్స్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి

పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి- సీతమ్మధార: రాష్ట్రంలో కుండపోత వర్షాలు దష్ట్యా, విద్యుత్ సమస్యల తక్షణ పరిష్కారానికి జిల్లా కేంద్రాల్లో పర్యవేక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎపిఇపిడిసిఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ పథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. జిల్లా కేంద్రాలలోని సూపరింటెండెంట్ ఇంజనీరు కార్యాలయంలో, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ నియంత్రణలో రౌండ్ ది క్లాక్ పనిచేసేలా ఈ పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నెంబర్ 1912 ఉందని, దానికి అదనంగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. తుపాను లేదా అధిక వర్షాల వలన విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయాలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, విద్యుత్ లైన్ల సమస్యల పరిష్కారానికి కింది ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ సర్కిల్, ఎస్ఇ ఏలూరు (9440812702), ఎస్ఇ రాజమహేంద్రవరం (9440812583), ఎస్ఇ విశాఖపట్నం (9440812487), ఎస్ఇ విజయనగరం (9440812447), ఎస్ఇ, శ్రీకాకుళం (9440812386) నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

బ్యాంకు లింకేజీ పంపిణీ

పాడేరు: ఐటీడీఏలోని శుక్రవారం జరిగిన స్పందన కార్యక్రమంలో 175 స్వయం సహాయ సంఘాలకు రూ.2 కోట్ల 51 లక్షల 85 బ్యాంకు లింకేజీ చెక్కును జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, ఐటిడిఏ పి వి అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ చేతుల మీదుగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు పంపిణీ చేసారు. హుకుంపేట మండలం లోని 60 సంఘాలకు రూ.కోటి, 28 లక్షల 85, ముంచంగిపుట్టు మండలంలోని 115 సంఘాలకు రూ.కోటి 23 లక్షల చెక్కును పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి వి.మురళి, ఎపిఎంలు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యఆరోగ్యశాఖలో కాంట్రాక్టు పోస్టుల భర్తీకి

1లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లాలో వైద్యఆరోగ్యశాఖలో వివిధ పోస్టులు ఏడాది కాలపరిమితికి కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగ నియామకాలకు ఆగష్టు ఒకటిలోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి జగదీశ్వరరావు తెలిపారు. డాట్స్, టిబి, హెచ్ఐవి సూపర్‌వైజర్, పిపిఎం కోఆర్డినేటర్, టిబి.హెల్త్ విజిటర్, అకౌంటెంట్, డెంటల్ మెడికల్ ఆఫీసర్స్, ఐసిటిసి కౌన్సెలర్, ఎఆర్‌టి కౌన్సెలర్, ఎఆర్‌టి డేటా మేనేజర్, ఐసిటిసి ల్యాబ్ టెక్నీషియన్, బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్, డేటా మేనేజర్ , స్టాఫ్‌నర్స్ పోస్టులకు www.visakhapatnam.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు లభిస్తాయన్నారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఆగస్టు ఒకటోతేదీ సాయంత్రం 5 గంటల లోగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో పనిచేసే దినాల్లో అందజేయాలని సూచించారు. మెరిట్ ఆధారంగా నియామకాలను చేపడతామన్నారు.

ఫీజుల వివరాల బహిర్గతంలో నిర్లక్ష్యం

సమీక్షలో మాట్లాడుతున్న సీతారాం

ప్రజాశక్తి-సీతమ్మధార : పాఠశాలల్లో వసూలు చేస్తున్న ఫీజుల వివరాలు విద్యార్థులు,తల్లిదండ్రులు తెలుసుకునే విధంగా నోటీసు బోర్డుల్లో పెట్టించాలని ఎంపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. శుక్రవారం సీతమ్మ ధార ఎంఇఒ కార్యాలయంలో నగరంలోని ఎంఇఒలు, క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్లుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజులు, మౌలిక సదుపాయాల వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల వివరాల వివరాలను నోటీసుబోర్డులో పెట్టాలన్న సూచనలను ఎంఇఒలు ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. అన్ని పాఠశాలలను ఎంఇఒలు సందర్శించి, బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్లు తమకు కేటాయించిన స్కూళ్లకు హాజరవుతూ బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎంఇఒలు, సిఆర్‌ఎం టీచర్లు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినట్లు తమ దృష్టికి వస్తే చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. సమీక్షలో సీతమ్మధార ఎంఇఒలు డి.రామారావు, బాలామణి, ,చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రోజెక్ట్ అధికారి శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, వార్డ్ ఎడ్యుకేషన్ సెక్రటరీలు పి.శేఖర్ కె.ఎల్లయ్య, లవ కుశ, ఎం.హరీష్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ ప్రవేశాలకు

31లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఆరిలోవ: 2023-24 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్) ద్వారా పదవ తరగతి , ఇంటర్ ప్రవేశాలకు ఆగస్టు 31 వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారిని ఎల్.చంద్రకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31లోగా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు అభ్యర్థులు నమోదు చేసుకొని, దగ్గరలో ఉన్న ఓపెన్ స్కూల్ సెంటరుకు వెళ్లి, ఒరిజనల్ సర్టిఫికేట్లు సమర్పించి ఫీజు చెల్లించి ప్రవేశం పొందవచ్చన్నారు.

సమస్యలపై విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

సీలేరులో నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు

ప్రజాశక్తి -సీలేరు

విద్యుత్ ఉద్యోగుల డిమాండ్ల సాధన కొరకు రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు సీలేరులో ఏపీ జెన్కో జేఏసీ నాయకులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు స్థానిక జోన్‌కో ఈఈ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, రెగ్యులర్ చేయాలని, విద్యుత్ ఉద్యోగులు పిఆర్‌సి అమలు చేయాలని నినాదాలు చేశారు. జేఏసీ నాయకులు కె.భవానీశంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లు విన్నవించినా పరిష్కరించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు వై. సత్తిబాబు వై.ధర్రాజు, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : ఎన్నో ఏళ్లుగా నెలకొన్న తమ సమస్యలు ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని కోరుతూ స్థానిక విద్యుత్‌శాఖ ఉద్యోగులు శుక్రవారం స్థానిక ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించకపోతే వచ్చే నెల 10 నుంచి సమ్మెకు దిగుతామని ఉద్యోగుల జెఎసి నాయకులు సురేష్ పేర్కొన్నారు. విద్యుత్ కార్మికుల నిరసనకు సిఐటియు జిల్లా నాయకులు పి.రామరాజు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ఉద్యోగులు, కార్మికులు అహర్నిశలు శ్రమిస్తున్నారని, వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ సిబ్బంది రాంబాబు, చిట్టిబాబు, దొర మాట్లాడారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ సురేష్ కుమార్, సిబ్బంది కిరణ్, ప్రసాద్, చిన్న, రాఘవ, శివ, లోవప్రసాద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో నినాదాలు చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

సీలేరులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-సీలేరు : మావోయిస్టు పార్టీ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆంధ్ర -ఒడిశా సరిహద్దు (ఎఒబి) ప్రాంతంలో పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. మావోయిస్టులు ఇప్పటికే సరిహద్దుల్లో అమరవీరుల వారోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అన్ని చర్యలు చేపట్టారని పోలీస్ ఇంటలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. ఆంధ్ర, ఒడిశా, చత్తీస్‌ఘడ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో అమరులైన మావోయిస్టులకు తాత్కాలిక స్థూపాలు ఏర్పాటు చేయడం, పాత వాటికి తుది మెరుగులు దిద్దడం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎఒబి నుంచి వచ్చే పోయే వాహనాలను పోలీసులు తనిఖీలు నిర్వహించి వారి వివరాలు సేకరించారు. సరిహద్దు గిరిజన గ్రామాల్లో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సరిహద్దుల్లో ఉన్న పోలీస్ అవుట్ పోస్టుల వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలను సైతం లెక్క చేయకుండా గ్రేహౌండ్స్ స్పెషల్ పార్టీ పోలీసులు అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. ఇందులో భాగంగా స్థానిక ఎస్సై రామకృష్ణ శుక్రవారం సీలేరులో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఏపీ జెన్కో చెక్‌పోస్టు వద్ద వాహనాలను నిలిపివేసి క్షుణ్ణంగా పరిశీలించారు. స్థానిక జల విద్యుత్ కేంద్ర పరిసర ప్రాంతాల్లో సిఆర్పిఎఫ్ పోలీసు బలగాలని గాలింపు చర్యలు చేపట్టారు. మరో వైపు మావోయిస్టులకు వ్యతిరేకంగా సీలేరులోని పలు ప్రాంతాల్లో గోడలపై వాల్ పోస్టర్లు వెలిచాయి.

రాజవొమ్మంగి : మావోయిస్టు వారోత్సవాలు సందర్భంగా రాజవొమ్మంగి ఎస్ఐ టిజీ నరేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం కింద్ర రింగ్ రోడ్ జంక్షన్ వద్ద ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ఏలేశ్వరం రాజవొమ్మంగి ప్రధాన రహదారి మీదుగా వచ్చిపోయే ప్రతి వాహనాన్ని ఆపి నిశితంగా తనిఖీలు చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. కొత్త వ్యక్తుల నుండి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఏపీఎస్పీ బెటాలియన్ పాల్గొన్నారు.

స్వరూప్ కుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు సచివాలయం ఇన్‌ఛార్జి విఆర్‌ఓగా లోపలి స్వరూప్ కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గత నాలుగేళ్లగా సీలేరు సచివాలయం వీఆర్వోగా పని చేసిన బోనంగి శ్రీనివాస్‌ను అధికారులు బదిలీ చేశారు. ఇన్‌ఛార్జి విఆర్‌ఓగా బాధ్యతలు చేపట్టిన స్వరూప్ కుమార్ దుప్పిలివాడ పంచాయతీ వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు. పంచాయతీ పరిధి ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ, వాలంటీర్లు దుర్జు, ఈశ్వర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

టిడిపి నాయకులపై దాడులు హేయం

ప్రజాశక్తి-చింతూరు : పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గంలో టిడిపి నాయకులపై వైసిపి నాయకులు చేసిన దాడులను టిడిపి మండల నాయకులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ టిడిపి

ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రను అడ్డుకునే ఉద్దేశంతో ఆ నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే, వైసీపీ శ్రేణులు టిడిపి నాయకులపై దాడి చేయడం జరిగిందని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం, వైసీపీ శ్రేణులు ఎన్నో అడ్డంకులు సృష్టించిన నేటికీ దిగ్విజయంగా పాదయాత్ర కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జిల్లా చిన్నారెడ్డి. నాయకులు వెంకటేశ్వరరావు, ముత్యాల శ్రీరామ్, పొదిల రామారావు పాల్గొన్నారు.

పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - ఉక్కునగరం : ఐక్య పోరాటాలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ స్పష్టం చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 897వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, క్యుఎటిడి, ఆర్ఇడి, టెలికాం, డిఎన్‌డబ్ల్యు విభాగాల ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ రంగ సంస్థలను ఎలా నిర్వీర్యం చేస్తోందో వివరించారు. విశాఖ ఉక్కును దెబ్బతీసేందుకు సొంత ఇనుప గనులు కేటాయించకుండా కాలయాపన చేస్తోందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ఉంటేనే రిజర్వేషన్లు అమలవుతాయని అన్నారు. ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపికి రానున్న కాలంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

మణిపూర్ ఘటనపై ఐద్వా నిరసన

నిరసన తెలుపుతున్న ఐద్వా కార్యకర్తలు

ప్రజాశక్తి-విఆర్.పురం

మణిపూర్ ఘటనకు నిరసనగా, అక్కడి మహిళలకు రక్షణ కల్పించాలని కోరుతూ చింతూరు మండలంలో ఏడు రాళ్ళపల్లి గ్రామంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా మండల అధ్యక్షురాలు మల్లం సుబ్బమ్మ మాట్లాడుతూ మణిపూర్లో ఇద్దరు. గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన వాళ్లని ఉరితీయాలని డిమాండ్ చేశారు. అక్కడ మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా రాష్ట్ర బిజెపి ప్రభుత్వం ఏమీ తెలియనట్టు వ్యవహరిస్తుందని విమర్శించారు. దీనికి మణిపూర్ ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేసి మహిళలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సావలం వెంకమ్మ, పత్రా పార్వతి, నాంచారమ్మ, సమ్మక్క, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఎపి ఉద్యోగ సాధన కమిటీ ఆధ్వర్యాన

సీలేరు : మణిపూర్ ఘటనకు కారణమైన హంతకుల్ని ఉరితీయాలని, ఆ రాష్ట్రంలో శాంతియుత వాతావరణం కల్పించాలని కోరుతూ ఏపీ జెన్కో ఉద్యోగ సాధన కమిటీ డిమాండ చేసింది. ఈ మేరకు జికె వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీలో శుక్రవారం మణిపూర్‌లో జరిగిన మారణ హోమంలో మరణించిన వారి ఆత్మ శాంతి చేకూరాలని కోరుతూ కమిటీ నాయకులు గొర్ల గణేష్, కూడా ఆనంద్ ఆధ్వర్యంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సాధన కమిటీ సభ్యులు కోర్ర రాము, కిలో గంగాధర్, రఘుపతి, కిలో మహేష్ బాబు, పదలం, భగత్, గౌరీ, శంకర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - రంపచోడవరం : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని రంప సచివాలయం పరిధి, మర్రివాడ పంచాయతీ, భీమవరం, లొద్దిపాలెం, దరమడుగుల మూలపాడు గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ధనలక్ష్మి చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో రంపచోడవరం మండల కన్వీనర్, ఎంపీపీ, జడ్పిటిసి, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపిటీసీలు, సొసైటీ ప్రెసిడెంట్, వివిధ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ కోఆప్షన్ సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - రంపచోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. సుమారు 10 కంపెనీ పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించాయి. 118 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా, వారిలో 35 మంది ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి జీ.ప్రశాంత్ తెలిపారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మాకర్ బాబు, ఎంప్లాయిమెంట్ అధికారి సంగీత, స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ జి.ప్రశాంత్ పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : మండలంలోని తంటికొండ గ్రామపంచాయతీలో పశువైద్యాధికారి తరుణ్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ ఆగూరి సుబ్బలక్ష్మి పర్యవేక్షణలో శుక్రవారం 47 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పశువులకు ముందస్తు చర్యల్లో భాగంగా జబ్బవాపు వ్యాధి నిరోధక వ్యాక్సిన్ వేయడం జరిగిందని పశు వైద్యాధికారి తరుణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యశాఖ సహాయకులు కిషోర్, జేజే ట్రస్ట్ సిబ్బంది వంశీ, గ్రామ వాలంటీర్లు రాజేశ్వరి, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

తామరపల్లిలో పారిశుధ్యంపై డ్రైవ్

ప్రజాశక్తి -రంపచోడవరం : మండలంలోని తామరపల్లి పంచాయతీ తామరపల్లి గ్రామంలో డ్రై డే ఫ్రైడేలో భాగంగా పారిశుధ్యంపై శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ముసిరిమిల్లి ఎంపీటీసీ సభ్యులు వంశి కుంజం ఊరులో ఉన్న ప్రతి డ్రైనేజీలో యాంటీ లార్వా మందును పిచికారీ చేశారు. ప్రతి ఒక్కరు దోమ తెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.